# మినీ టు మెయిన్..



- వికారాబాద్ జిల్లాలో 138 మినీ అంగన్‌వాడీ కేంద్రాల అప్‌గ్రేడ్
- ఉత్తర్వులు జారీ చేసిన సర్కార్.. టీచర్లకు పెరగనున్న వేతనం
- జిల్లావ్యాప్తంగా మొత్తం 1,107 ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలు

బొంరాస్‌పేట, డిసెంబర్ 28 : మినీ అంగన్‌వాడీ కేంద్రాలకు మంచి రోజులు వచ్చాయి. రాష్ట్రంలోని మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఇటీవలే ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ నిర్ణయంతో వికారాబాద్ జిల్లాలో 138 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ప్రధాన కేంద్రాలుగా అప్‌డ్రేడ్ అయ్యాయి. జిల్లాలో ఇప్పటివరకు 969 ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా మినీ కేంద్రాల అప్‌గ్రేడ్‌తో వీటి సంఖ్య 1,107 చేరింది. ప్రభుత్వ నిర్ణయంపై అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో గిరిజన ప్రాంతాల్లో 300 పైగా జనాభా, అర్బన్ ప్రాంతాల్లో 400 పైగా జనాభా ఉన్న ప్రాంతాల్లోని మినీ కేంద్రాలు ప్రధాన కేంద్రాలుగా అప్‌గ్రేడ్ అయ్యాయి. ఫలితంగా వీటిలో పనిచేసే టీచర్ల వేతనం పెరగడంతో పాటు ప్రతి కేంద్రానికి సహాయకురాలిని నియమించనున్నారు.

**పెరిగిన జనాభా ప్రాతిపదికన..**

పదేండ్లుగా కొనసాగుతున్న మినీ అంగన్‌వాడీ కేంద్రాలు పెరిగిన జనాభా ప్రాతిపదికన ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా మారాయి. రాష్ట్ర ప్రభుత్వం గతంలో చేపట్టిన కుటుంబ సర్వే ఆధారంగా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా మార్చింది. వికారాబాద్ జిల్లాలో వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్, మర్పల్లిలో ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉండగా వీటి పరిధిలో 969 ప్రధాన, 138 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా మినీ కేంద్రాలు ప్రధాన కేంద్రాలుగా అప్‌గ్రేడ్ అయ్యాయి. కొడంగల్ ప్రాజెక్టు పరిధిలో 8, మర్పల్లిలో 17, పరిగిలో 74, తాండూరులో 20, వికారాబాద్ ప్రాజెక్టు పరిధిలో 19 మినీ అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి.

**కుటుంబ సర్వే ఆధారంగా మార్పు**

పదేండ్ల క్రితం అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో తక్కువ జనాభా ఉండడం, రెవెన్యూ గ్రామాలకు ఆవాసాలు దూరంగా ఉండడంతో నాటి ప్రభుత్వం ఆయా ప్రాంతాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఇప్పుడు వాటి పరిధిలో జనాభా, కుటుంబాలు పెరగడంతో మినీ కేంద్రాల నుంచి సేవలు అందించడం కష్టతరంగా మారింది. వాటిని మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలుగా మార్చాలని వచ్చిన విజ్ఞప్తులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయించింది.

### 138 కేంద్రాలు అప్‌గ్రేడ్ అయ్యాయి



జిల్లాలో 138 మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసింది. ప్రధాన కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నది. అప్‌గ్రేడ్ అయిన కేంద్రాల్లో టీచర్లు, సహాయకుల పోస్టుల భర్తీకి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నోటిఫికేషన్ జారీ చేస్తాం.

**- లలితాకుమారి, సంక్షేమ శాఖ జిల్లా అధికారి, వికారాబాద్**

### అప్‌గ్రేడ్‌తో పెరగనున్న హెల్పర్ల పోస్టులు

మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్ ఒక్కరే ఉంటారు. హెల్పర్ ఉండరు. దీంతో అన్ని పనులు టీచరే చేయాల్సి వస్తుంది. మెయిన్ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ అయితే ప్రభుత్వం వీటికి హెల్పర్ పోస్టులను మంజూరు చేసి నియమిస్తుంది. దీంతో కొంతమందికి ఉపాధి దొరుకుతుంది. అలాగే మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో పని చేసే టీచర్ మెయిన్ కేంద్రాల్లో ఉండే టీచర్ మాదిరిగా అన్ని పనులు చేస్తున్నా వారికి వేతనం మాత్రం తక్కువ వచ్చేది. ప్రధాన కేంద్రాల్లో పని చేసే టీచర్‌కు నెలకు వేతనం రూ.13,650 ఉండగా, మినీ కేంద్రంలోని టీచర్‌కు రూ.7800 మాత్రమే. అప్‌గ్రేడ్‌తో మినీ కేంద్రాల టీచర్ల వేతనం కూడా పెరిగి వారికి ప్రయోజనం కలుగుతున్నది. ప్రధాన కేంద్రాలుగా మారనున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇంటర్ విద్యార్హత ఉన్న వారు టీచర్లుగా కొనసాగుతారు. ఇంటర్ అర్హత లేని వారు హెల్పర్లుగా కొనసాగుతారు. దీని ఆధారంగా ఖాళీలను గుర్తించి ఎక్కడెక్కడ టీచర్లు, హెల్పర్లు అవసరమో నోటిఫికేషన్ జారీ చేసి నియామకాలు చేపడుతారు.

## మహిళా హక్కులపై అవగాహన అవసరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మహిళా సాధికారత వికారాబాద్ జిల్లా కో-అర్డినేటర్ బలరామ్

ధారూరు, డిసెంబర్ 28 : విద్యార్థినులకు మహిళా హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మహిళా సాధికారత వికారాబాద్ జిల్లాకో-అర్డినేటర్ బలరాం అన్నారు. గురువారం మహిళా శిశు, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, వికారాబాద్ జిల్లాలోని మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో ధారూరు మండల పరిధిలోని తరిగోపుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా మహిళా హక్కులు, చట్టాలు, పిల్లలు, మహిళలు, వృద్ధులు, దివ్యాంగుల హెల్ప్‌లైన్ నంబర్లపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా ఆడపిల్లల్నీ మనం కాపాడుకోవాలని, వారికి సరైన విద్య, వైద్యం అందించాలన్నారు. బాలికల కోసం సుకన్య సమృద్ధి యోజన, పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై, ఏపీవై పథకాలు పోస్టాఫీస్‌ల ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు. వీటిని ప్రతి ఒక్కరూ సద్వినిమోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివకుమార్, సిబ్బంది బాబు, రాందాస్, వరలక్ష్మి పాల్గొన్నారు.

## రేపటి నుంచి కృష్ణస్వామి జాతర బ్రహ్మోత్సవాలు



దుద్యాల సమీపంలో వెలిసిన శ్రీకృష్ణస్వామి

బొంరాస్‌పేట, డిసెంబర్ 28 : దుద్యాల మండల కేంద్రం సమీపంలో కృష్ణగిరిపై వెలిసిన శ్రీ కృష్ణస్వామి 21వ జాతర బ్రహ్మోత్సవాలు ఈ నెల 30, 31 తేదీల్లో రెండు రోజుల పాటు జరుగుతాయని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం ఉదయం 6 గంటలకు ఆంజనేయస్వామికి సింధూర పూజ, 8.15 గంటలకు గ్రామంలోని వీరాంజనేయస్వామి మందిరం నుంచి జలకుంభాల ఊరేగింపు, జలకుంభాభిషేకం, పల్లకీసేవ, 10.30 గంటలకు ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం 1 గంటకు అన్నదానం, సాయంత్రం 4.30 గంటలకు సత్సంగ సభ, రాత్రి 8.30 గంటలకు వీరాంజనేయ భజన మండలి భక్తులతో అడుగుల భజన ప్రదర్శన, భజన కార్యక్రమాలు ఉంటాయని వారు తెలిపారు. ఆదివారం ఉదయం 6 గంటలకు స్వామి వారికి ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం పెరుగు బసంతం, ఆదివారం తెల్లవారుజామున 3 గంటలకు లంకాదహనం, అనంతరం ఆంజనేయస్వామి మందిరం నుంచి స్వామి వారికి పల్లకీసేవ నిర్వహించి ప్రసాద వితరణ కార్యక్రమాలు ఉంటాయని వారు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

# ఆధ్యాత్మికతతోనే మిత్రృత్వం

- విశ్వ నియమాలు సకల ప్రాణకోటికి ఒక్కటే.. : పరిమళ పత్రీ
- కొనసాగుతున్న ధ్యాన మహాయాగం సభలు
- ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన, చిన్నారుల విన్యాసాలు
- పాల్గొన్న ఆధ్మాత్మిక గురువులు, పిరమిడ్ మాస్టర్లు, ధ్యానులు



ధ్యాన మహాయాగంలో మాట్లాడుతున్న పరిమళ పత్రీ



ధ్యాన మహాసభలో పాల్గొన్న వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ధ్యానులు

కడ్తాల్, డిసెంబర్ 28 : పుడమిపై ఉన్న సమస్త ప్రాణకోటికి విశ్వ నియమాలు ఒక్కటేనని, సద్గుణాలు కలిగి ఉన్న వారికి భవిష్యత్తు బాగుంటుందని పీఎస్ఎస్ఎం చైర్మన్ పరిమళ పత్రీ అన్నారు. మండల కేంద్రం సమీపంలోని కైలాసపురి మహేశ్వర మహా పిరమిడ్‌లో, ది పిరమిడ్ స్పిరిచ్యువల్ ట్రస్టు చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న పత్రీజీ ధ్యాన మహాయాగాలు గురువారం ఎనిమిదో రోజుకు చేరుకున్నాయి. ఉదయం 5 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన, ప్రాతఃకాల ధ్యానంలో పరిమళ పత్రీ, పరిణీత పత్రీ, వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన ధ్యానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధ్యానులనుద్దేశించి పరిమళ పత్రీ మాట్లాడుతూ నిత్యం ధ్యాన సాధనతో ఒత్తిడి తగ్గి మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. మనిషి ప్రతి విషయంలో మంచి వెతకాలని, ఎదుటి వారితో ప్రేమానురాగాలతో మెలగాలని పేర్కొన్నారు. ఆధ్మాత్మికతోనే ప్రతి ఒక్కరికి సరైన మిత్రృత్వం లభిస్తున్నదని తెలిపా రు. పత్రీజీ శక్తిస్థల్‌ను అద్భుతంగా తీర్చిదిద్దుకోవాల్సిన బాధ్యత ప్రతి ధ్యానిపైన ఉన్నదని పేర్కొన్నారు.

**ఊహా శక్తికి ధ్యానం తోడైతే..**

పరిణితీ పత్రీ మాట్లాడుతూ.. నాన్ కిల్లింగ్, నాన్ వైలెన్స్, నాన్ ఫియరెన్స్ అనే సూత్రాలతో ప్రతి ఒక్కరూ ముందుకెళ్లాలని తెలిపారు. జంతు వధశాలలు మూతపడితేనే ప్రపంచంలో శాంతి నెలకొంటుందని పేర్కొన్నారు. ఊహా శక్తికి ధ్యానం తోడైతే సాధించలేనిది ఏమిలేదని పేర్కొన్నారు. అనంతరం ప్రముఖ ప్రవచనకర్త నండూరి శ్రీనివాసరావు ప్రవచనలు, కళాకారుల నృత్య ప్రదర్శనలు, పిరమిడ్ మాస్టర్ల ప్రసంగాలు ధ్యానులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, సభ్యులు బాలకృష్ణ, హన్మంతురాజు, సాంబశివరావు, రాంబాబు, శివప్రసాద్, దామోదర్‌రెడ్డి, కిషన్ రెడ్డి, మాధవి, జయలక్ష్మి, ధ్యానులు తదితరులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న చిన్నారుల విన్యాసాలు